క్షేత్రస్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఏర్పాటుచేసిన అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి ఆ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ పురోగతిపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో 31 వేల 800ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా, అందులో 1,957 మాత్రమే పరిశీలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అలసత్వాన్ని వీడి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి రత్నకుమారి, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ సిటీప్లానర్ రవీంద్ర రడెకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి

ప్రభుత్వం నిర్ధేశించిన నియమాలపై రైతులకు అవగాహన కల్పించి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరుపాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చేయగా, ఇప్పటివరకు 14 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. డిఫాల్టర్ రైస్ మిల్లర్లకు ఈ సీజన్‌లో ధాన్యం ఇవ్వడం లేదని, మిగతా మిల్లర్లకు బ్యాంక్ గ్యారంటీతో ధాన్యం కేటాయిస్తామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీసీవో నీరజ, వ్యవసాయశాఖ అధికారి అనురాధ, పౌరసరఫరాల శాఖ డీఎం బి.సంధ్యారాణి, డీసీఎస్‌వో కిష్టయ్య, డీఎంవో సురేఖ, రైస్ మిల్లర్స్ పాల్గొన్నారు.

2న బీసీ కమిషన్ సభ్యుల రాక

స్థానిక సంస్థల రిజర్వేషన్ల కల్పనపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బీసీ కమిషన్ సభ్యులు నవంబరు 2వ తేదీన హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశానికి హాజరవుతున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, భాగ్యలక్ష్మీ వస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ప్రజలు తమ అభిప్రాయాలను, విజ్ఞప్తులను కమిషన్ బృందానికి సమర్పించాలని కలెక్టర్ కోరారు.

వరంగల్ డీఎంహెచ్‌వోగా సాంబశివరావు

హనుమకొండ డీఎంహెచ్‌వోగా అప్పయ్య



సాంబశివరావు



డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల అయోమయానికి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఎట్టకేలకు తెరదించింది. వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ సాంబశివరావును, హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ అప్పయ్యను నియమిస్తూ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల కాలం నుంచి వరంగల్, హనుమకొండ జిల్లాల ఆరోగ్యశాఖలో అయోమయం నెలకొంది. తాజా ఉత్తర్వులతో స్పష్టత వచ్చింది. ఇంతకాలం వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేసిన డాక్టర్ వెంకటరమణ కరీంనగర్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా కొనసాగనున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

మట్టెవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 23 మందికి బుధవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. 23 మందికి రూ.237000, అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురికి రూ. 4500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

కళ్లు చెదిరేలా..

Iవ పేజీ తరువాయి

ధ్యాన, సమాధి వీటిని అనుసరిస్తే మనలోని బద్ధకాన్ని త్యజిస్తే లోకకల్యాణం సిద్ధిస్తుందన్నారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి రిమోట్‌తో నరకాసుర వధను ప్రారంభించారు.అంతకు ముందు వేడుకల్లో భాగంగా సాయంత్రం 6 గంటలకు శ్రీ కృష్ణ సత్యభామ వేష ధారణలో కళాకారులను ఊరేగింపుగా వేదికకు తీసుకొచ్చారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో ఉర్సు గుట్ట మైదానం కిక్కిరిసిపోయింది. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నరకాసుర వధ ఘట్టం, ప్రత్యేక బాణసంచా వెలుగులు ప్రజలను విపరీతంగా ఆకట్టుకున్నాయి. వేడుకల నిర్వహణకు సహకరించిన దాతలను ముఖ్య అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లం పద్మ, నరకాసుర వధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉర్సు గుట్ట మైదానంలో జరిగిన ఉత్సవాలకు హాజరైన ప్రజలు



పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పారా మెడికల్ బోర్డు ఉత్తర్వుల ప్రకా రం నవంబరు 11వ తేదీలోపు కాకతీయ మెడికల్ కాలేజీలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్ ప్రతులను సమర్పించాలని సూచించారు.

విద్యార్థులు సమాజసేవలో ముందుండాలి

శంభునిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సమాజసేవలో ముందుండాలని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ అన్నారు. నగరంలోని రంగశాయిపేటలో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం ట్రాఫిక్ నియంత్రణలో భాగస్తులయ్యారు. దీపావళి సందర్భంగా రద్దీగా ఉండే వరంగల్ హెడ్ పోస్టాఫీసు ప్రాంతంలో ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ట్రాఫిక్ నియంత్రణపై సీఐ పలు సూచనలు ఇచ్చారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కోఆర్డినేటర్ మాణిక్యరేఖను పోలీసులు ప్రశంసించారు.

పారిశుధ్య కార్మికులకు చీరెల పంపిణీ

మట్టెవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటర్ గందె కల్పనా నవీన్ బుధవారం 28వ డివిజన్ మునిసిపాలిటీ సిబ్బంది, మహిళలకు చీరెలు, పురుషులకు వస్త్రాలు పంపిణీ చేశారు. బాగల్ కల్యాణ్, రాముని కృష్ణ సుమన్, కొత్తపెల్లి రాజేష్, శిల్పా కార్తీక్, సిద్దిరాములు, మురళి, లక్ష్మణ్, పవన్, లోకేష్, కిరణ్, దామోదర్, శ్రీకాంత్, చందు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ గోరంత.. వ్యాపారం కొండంత

- బాణసంచా వ్యాపారులు నిబంధనలు బేఖాతర్
- చోద్యం చూస్తున్న అధికారులు, పోలీసులు



మట్టెవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో బాణసంచా వ్యాపారులు నిబంధనలను బేఖాతర్ చేస్తున్నారు. టన్నులకొద్దీ బాణసంచాను ఇళ్లలో, షాపుల్లో, ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేస్తున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 300లకు పైగా తాత్కాలిక బాణసంచా దుకాణాలకు అగ్నిమాపక శాఖ అనుమతి ఇవ్వగా 500 కిలోల వరకు అమ్మేందుకు అనుమతి తీసుకొని వేల కిలోల టపాసులను నగర శివారు ప్రాంతాల్లో డంప్ చేసినట్లు తెలిసింది. ముఖ్యంగా వరంగల్ మట్టెవాడ, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ల పరిధిలో పెద్ద ఎత్తున నిల్వలు ఉన్నట్లు సమాచారం. అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం అగ్నిమాపక సాధనాల సంరక్షణలో బాణసంచా నిల్వ చేయాలి. అనుమతికి మించి నిల్వ చేయరాదు. కాని, రాజకీయ పలుకుబడి ఉన్న వ్యాపారులు పోలీసులను, అగ్నిమాపక విభాగం అధికారులను మేనేజ్ చేసుకొని వ్యాపారులు టన్నులకొద్దీ బాణసంచా నిల్వ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇంత జరుగుతున్నా స్థానిక పోలీసులు, అగ్నిమాపక విభాగం అధికారులు ఎలాంటి తనిఖీలు చేపట్టలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టాస్క్‌ఫోర్స్ దాడులతో ఖంగుతిన్న పోలీసులు

వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో మట్టెవాడ, మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బాణసంచా దుకాణాలపై దాడులు నిర్వహించారు. అనుమతి లేని సుమారు రూ. 2.30 కోట్ల విలువైన బాణసంచాను స్వాధీనపర్చుకున్నారు. వరుస టాస్క్‌ఫోర్స్ దాడులతో స్థానిక మట్టెవాడ పోలీసులు, మిల్స్‌కాలనీ పోలీసులు ఖంగుతిన్నారు.

'తెలంగాణ దర్శిని'పై అవగాహన కల్పించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దర్శిని కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించి చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టూరిజం క్లబ్‌లలో సభ్యత్వం పొందిన విద్యార్థులతోపాటు డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, మైనార్టీ సంక్షేమ అధికారి సౌజన్య, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

సర్వేపై అధికారులకు అవగాహన ఉండాలి

కాశిబుగ్గ(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నవంబరు 6 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్య)పై అధికారులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. సేకరించిన వివరాలు గోప్యంగా ఉంచాలని సూచిం చారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వే మార్గదర్శ కాలపై మండలాల అధికారులు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలన్నారు. సేకరించిన వివరాలు ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేయాలన్నారు. సర్వేపై మండల స్థాయిలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటినెంబర్ల ఆధారంగా సర్వే చేపడుతా రని, ఎన్యుమరేటర్లు తప్పక ప్రతీ ఇంటికి వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరిం చాలని సూచించారు. ఆధార్ కార్డు ప్రకారం వివరాలు నమోదు చేయాల న్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, సీపీవో గోవింద రాజులు, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా చూడాలంటూ వినతి

వరంగల్ కలెక్టరేట్: రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కలెక్టర్ సత్యశారదకు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయాల మూలంగా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ మార్కెట్ అధికారులకు తెలియకుండానే చాంబర్ ఆఫ్ కామర్స్ ధరల విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలు మార్కెట్ నియమాలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. ధరల క్రమబద్ధీకరణ విచ్ఛిన్నం అయితే రైతులకు మార్కెట్‌పై విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఏఐకేఎఫ్ నాయకుడు నగేష్, జెండా అంబయ్య, రవీందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పేదల తరపున కొట్లాడే పార్టీ

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



స్వీట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

మట్టెవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన కొట్లాడే పార్టీ బీఆర్ఎస్ అని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఫలించడంతో కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం వరంగల్ తూర్పులో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత కరెంట్ పథకం అని తీసుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలపై కోట్లాది రూపాయల భారాన్ని మోపాలని చూసిందని, ఇందుకు వ్యతిరేకంగా పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని కేటీఆర్ విద్యుత్ బిల్లులు పెంచకుండా ఒప్పించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మార్కెట్ మాజీ చైర్మన్ టి.రమేశ్‌బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు మోడెం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాటం

కాజీపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికుల హక్కుల కోసం పోరాడేది రైల్వే మజ్దూర్ యూనియన్ మాత్రమేనని, రాబోయే ఎన్నికల్లో కార్మికులంతా మజ్దూర్ యూనియన్ గెలుపు కోసం కృషి చేయాలని ఆ సంఘం డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్ అన్నారు. కాజీపే ట ఎలక్ట్రికల్ షెడ్‌లో బ్రాంచ్ సెక్రటరీ నాయిని సదానందం అధ్వర్యంలో బుధవారం రైల్వే కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో పిల్లల మర్రి రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిసెంబర్ 4,5,6 తేదీల్లో రైల్వే గుర్తింపు సంఘాల ఎన్నికల్లో రైల్వే కార్మికులంతా మజ్దూర్‌ను బలపర్చాలన్నారు. 8వ పే కమిషన్, ఓపీఎస్ సాధన, డీఏలు, రిస్క్ అలవెన్స్‌లు, ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, లాంటివి సాధించాలంటే మజ్దూర్‌కే సాధ్యమన్నారు. సీసీ ఎస్ డైరెక్టర్ డా. డి. శ్రీనివాస్ యాదవ్, బ్రాంచ్ చైర్మన్ ఇబ్రహీం, ఆఫీస్ బేరర్స్ రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌కు అంతిమ వీడ్కోలు

వడ్డెపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఒకప్రైవేటు ఆస్పత్రిలో తుది శ్వాస విడిచిన హనుమకొండ రాయపుర ప్రాంతానికి చెందిన వీడియో జర్నలిస్టు కాగితోజు రాజ్‌కుమార్ అంత్యక్రియలు బుధవారం సాయంత్రం నిర్వహించారు. అంతకు ముందు హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌కు ఆయన భౌతిక కాయం తీసుకురాగా పాత్రికేయులు, వీడియో జర్నలిస్టులు కడసారి సందర్శించి ఆయన చేసిన సేవలను స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన భౌతిక కాయాన్ని కుటుంబసభ్యులు, పాత్రికేయులు వెంట రాగా హనుమకొండలోని పద్మాక్షి శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



రాజ్‌కుమార్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు



పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి సాయికుమార్

మదర్ థెరిసా హోమ్‌ను సందర్శించిన జడ్జి

కాశిబుగ్గ, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని మిషనరీస్ ఆఫ్ చారిటీ (మదర్ థెరిసా హోం)ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్ బుధవారం సందర్శించారు. అనాథ, వృద్ధ, మానసిక వికలాంగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. నిర్వాహకులను కొనియాడారు. దివ్యాంగులకు సేవచేయడం అదృష్టంగా భావించాలన్నారు. నిరంతరం సేవలందిస్తున్న 43మంది సిస్టర్స్‌కు న్యాయమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. ఎటువంటి సహాయ సహకారాల కోసమైనా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిస్టర్లు రోజ్ అల్కా, సవీనా మేరియా తదితరులు పాల్గొన్నారు.

ముందుగా న్యాయమూర్తి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను సందర్శించారు. డాక్టర్లు, చికిత్స పొందుతున్న వారితో ఆయన మాట్లాడి ఆసుపత్రి పరిస్థితిని తెలుసుకున్నారు. సిబ్బంది, పరికరాల కొరతను తెలుసుకున్న ఆయన సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు.

స్వచ్ఛంద సేవలను విస్తృతం చేయాలి

ఖిలావరంగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పిల్లల సంక్షేమ కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు వారి సేవలను మరింత విస్తృతం చేయాలని, మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని డాన్‌బాస్కో డైరెక్టర్ ఫాదర్ ఖోషి పిలుపునిచ్చారు. బుధవారం శివనగర్‌లోని డాన్‌బాస్కో స్ట్రీట్ చిల్డ్రన్ హోమ్‌లో చైల్డ్ రైట్స్ సెలబ్రేషన్ వీక్ కార్యక్రమాలను అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 14 నుంచి 20 వరకు ప్రతీరోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. వాక్‌థామ్, పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ, పిల్లలతో ఓపెన్ హౌజ్, పిల్లల సంరక్షణ సంస్థల కోసం చైల్డ్ మేళా, బాలల లైంగిక దాడులు.. నివారణ, చికిత్సపై అవగాహన, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ ప్రణాళిక ద్వారా పిల్లల హక్కుల పరిరక్షణ, కుటుంబ భద్రత, ప్రాధాన్యతను గుర్తించేందుకు డాన్‌బాస్కో కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 'ఫ్యామిలీ ఈజ్ వేర్ ఐ బెలాంగ్' అనే నినాదంతో పోస్టర్‌ను విడుదల చేశామన్నారు. ఇది పిల్లలలో కుటుంబ విలువల ప్రాముఖ్యతను, యువతలో కుటుంబ విలువలను బలపరిచే లక్ష్యాలన్ని ప్రతిబింబిస్తుందన్నారు.

ఈ సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వరంగల్ చైర్‌పర్సన్ వసుధ, నాగవాణి, మాజీ చైర్‌పర్సన్ మండల పరశురాములు, అనితారెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యులు పరికి సుధాకర్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు క్రాంతి, ఎర్ర శ్రీకాంత్, పలడుగుల సురేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాన్‌బాస్కో డైరెక్టర్ ఖోషి



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 31 అక్టోబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి

ఖానాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమ కారుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అంబటి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు కోసం బుధవారం బుధరావుపేట శివారులోని విజేత ఐటీఐ కళాశాలలో జేఏసీ డివిజన్ కన్వీనర్ గుంటి రాంచందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమకారుల హామీలను నెరవేర్చడంలో, నెరవేర్చించుకోవడంలో ప్రధాన భూమిక పోషించడం కోసం అన్ని వర్గాలను కలుపుకొని పార్టీలకతీతంగా ఉద్యమకారుల జేఏసీలను పునర్నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలోని ఉద్యమకారుల గళాన్ని మరోసారి జేఏసీ రూపంలో పార్టీలకతీతంగా వినిపించాలన్నారు. అనంతరం జేఏసీ మండల అడహక్ కమిటీ కన్వీనర్లుగా కోడి మల్లేష్‌యాదవ్, కందికట్ల జయ, చీఫ్ అడ్వయిజర్‌గా వెంకట్‌నారాయణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాంబరాతి మల్లేశం, డివిజన్ కో-కన్వీనర్ జగన్, వీరమాచనేని కృష్ణరావు. జావిద్, శోభ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



వర్షిత్ (ఫైల్)

జ్వరంతో బాలుడి మృతి

నల్లబెల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారక్కపేట గ్రామంలో ఓ బాలుడు జ్వరంతో మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... నారక్కపేటకు చెందిన కుసుంబ ప్రవళిక-బాబురావు దంపతుల కుమారుడు వర్షిత్ (10) రెండు రోజులుగా జ్వరంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు వర్షిత్‌ను హనుమకొండలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలోని సమీప పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న బాలుడు అర్ధాంతరంగా మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గీత కార్మికుడికి గాయాలు

నెక్కొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దీక్ష కుంటకు చెందిన గీత కార్మికుడు మేరుగు శివ మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలకు గురయ్యాడని గ్రామస్తులు తెలిపారు. శివను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కుడి చేయి విరగడంతో పాటు పలు చోట్ల గాయాలు తగిలాయి.

కాంగ్రెస్ నుంచి మర్రి నాగరాజు సస్పెన్షన్

నల్లబెల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిగామ గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మర్రి నాగరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం తిరుపతిరెడ్డి నల్లబెల్లి మండల కేంద్రంలో మాట్లాడుతూ నాగరాజు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నదున ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

అకాల వర్షం

రైతుల కష్టం నీళ్లపాలు

మార్కెట్‌లో తడిసిన మొక్కజొన్నలు



నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిప మొక్కజొన్నల రాసి దగ్గరకు చేసేందును ఇబ్బందులు పడుతున్న రైతులు

నర్సంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేటలో బుధవారం కురిసిన అకాల వర్షం మొక్కజొన్న రైతులను నిండాముంచింది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతో కూడిన వర్షం గంట పాటు కురిసింది. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో అకాలవర్షం కారణంగా మొక్కజొన్న రాసులపై రైతులు పరదాలు కప్పుకునే అవకాశం లేకుండా పోయింది. మరికొందరు ముందు జాగ్రత్తగా పరదాలు కప్పినా నీరు పరదాల కిందికి చేరి తడిసి పోయాయి. మార్కెట్‌లో ఆరబోసుకున్న మక్కజొన్నలు తడిసి ముద్దయి వర్షపు నీటిలో మక్కలు కొట్టుకు పోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. తడిసిన మొక్కజొన్నల రాసులపై పరదాలు కప్పేందుకు, తడిసిన మక్కలను రాసులుగా చేసేందుకు, కొట్టుకుపోయిన మక్క లను దగ్గరకు చేసేందుకు రైతులు నానా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. వారం, పదిరోజుల వ్యవధిలో రెండు పర్యాయములు కురిసిన వర్షాల వల్ల ఆరబోసుకున్న మక్కలు తడిసి, నీటిలో కొట్టుకు పోయి నష్టాలపాలు కావాల్సి వచ్చిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో క్వింటాల్ మక్కజొన్నలను రూ.2522 నుంచి రూ.2345, రూ.2450 ధర వరకు కొనుగోలు చేస్తున్నారని ఇప్పుడు తడిన మక్కలను ధర తగ్గించి కొనుగోలు చేస్తారేమోనని దీంతో నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన మక్కలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసేలా మార్కెట్ చైర్మెన్, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రేసులబోడులో నెలవాలిన వరి పంట

నెల వాలిన వరి పంటలు

చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమీనాబాద్, రేసుల బోడ తండా, జల్లి, పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం కురిసిన గాలి వాన బీభత్సవంతో వరి పంటలు నెలవాలాయి. రేసులబోడు తండాలోని గుగులోతు విజేందర్, కిషన్, మూడు శ్రీను, భాస్కర్ లతో పాటు పలువురి రైతులకు చెందిన వరిపంట సుమారు 20 ఎకరాల వరకు నెలమట్టమయ్యాయి.

చేతికి వచ్చిన వరి పంట లు నెలవాలడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టం జరిగిన పంటలను వ్యవసాయశాఖాధికారులు పరిశీలించి నష్టం పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

తడిసిన దీపావళి టపాసులు

నెక్కొండ (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైతులు ముందుగానే వర్ష సూచనను గర్తించడంతో నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌లో విక్రయానికి తీసుకు వచ్చిన పత్తి, మక్కలు తడవకుండా జాగ్రత్త పడ్డారు. దీపావళి పండుగ పర్వదీనం సందర్భంగా లక్షల రూపాయల పెట్టుబడులతో నెక్కొండ హై స్కూల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయ షాపులోని టపాసులు 80 శాతం వరకూ నీటిలో తడిశాయి. షాపుల యజమానులు వర్షంలో టపాసులు తడవ కుండా జాగ్రత్త పడ్డప్పటికీ భారీ వర్షం కురవడంతో టపాసులపై కప్పిన తాటిపత్రులు వర్షం నీటిని నిరోదించ లేక పోయాయి. మధ్యాహ్నం రెండు గంటలకు మొదలైన వర్షం మూడు గంటల పాటు కురిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అలాగే సూరుపల్లి, పెద్దకొర్పోలు, చిన్నకొర్పోలు, నాగారం, అమీన్‌పేట తదితర గ్రామాల్లో చేతికంది వచ్చిన వందల ఏకరా ల వరిపంట నీటిపాలైయిం ది. దీంతో దీపావళి పండుగ రోజున రైతు కుటుంబ సభ్యులు కంటతడి పెట్టాల్సి వచ్చింది. టీకే తండా గ్రామ శివారు రేసులబోడు తండాల్లో గుగులోతు నర్సింహా, గుగులోతు విజేందర్‌కు చెందిన ఎనిమిది ఏకరాల వరి పంట మొత్తం నీట మునగడంతో వర్షంను సైతం లెక్కచేయని రైతులు వరి పంటకు గండ్లుపెట్టి నీటిని బయటకు పంపించారు. జోరు వర్షం కారణంగా రైతుల శ్రమ వృధా కాకతప్పలేదు.



నెక్కొండ హై స్కూల్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన దీపావళీ టపాసుల విక్రయ షాపులు

ఆరు గ్యారంటీలతో మోసం చేసిన కాంగ్రెస్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చేప్పేం దుకు బిఆర్ ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం హనుమకొండలోని ఆయన స్వగృహంలో సంగెం మండల సమన్వయ కమిటీ నాయకులతో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెం టీలను అమలు చేయలేక చేతులు ఎత్తివేసే పరిస్థితిలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, రైతు భరోసా అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామా ల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తల అభిప్రాయాలను సేకరించాలని నాయకులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, రెడ్‌క్రాస్ సొసైటీచైర్మన్ నిమ్మగడ్డ వేంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు సమ్మయ్య యాదవ్, బుక్క మల్లయ్య, మన్సూర్ అలీ, పూజారి గోవర్ధన్, మాజీ ఎంపీపీలు దోనికెల మల్లయ్య, కక్కెర్ల సదానందం, సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి యాదవ్, బొంపెల్లి దిలిప్‌కుమార్, రాజు, జక్క మల్లయ్య పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు కోసం పోరాటాలే శరణ్యం



సభలో మాట్లాడుతున్న చింతమల్ల రంగయ్య

నర్సంపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య అన్నారు. పట్టణంలో ఐఎంఏ హాల్‌లో పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధ్యక్షతన బుధవారం ఆహ్వాన సంఘం సన్నాహక సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రంగయ్య మాట్లాడుతూ ప్రజా పోరాటాలకు ఎర్రజెండా దిక్సూచిగా పనిచేస్తుందన్నారు. మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య కుల, మతాల పేరిట విద్వేషాలను రెచ్చగొట్టి పాలన కొనసాగిస్తున్నదన్నారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కులను కేంద్రం కాలరాస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. నవంబరు 29, 30 తేదీల్లో నర్సంపేట పట్టణంలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బెంబేరి మల్లల్‌రావు, కత్తి కట్టయ్య, పెండ్యాల సారయ్య, అన్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

టపాసులు కాల్చి బీఆర్ఎస్ పార్టీ సంబరాలు



నర్సంపేటలో టపాసులు కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నర్సంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. కరెంట్ చార్జీలు పెంచి రూ.18,500 కోట్లు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపాలనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాన్ని ఆపినందుకు సంబరాలు జరుపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నర్సంపేట పట్టణంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి నల్లమనోహర్‌రెడ్డి, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మండల శ్రీనివాస్, నాగిశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ ఎండి. మహబూబ్ పాషా, శివరాత్రి స్వామి, గందె చంద్రమౌళి, పెండెం వెంకటేశ్వర్లు, పెరుమాండ్ల రవి, వాసం సాంబయ్య, రమేశ్, రవీందర్, బీరంనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి (ఆంధ్రజ్యోతి): కరెంటు చార్జీలు పెంచి ప్రజల పై విద్యుత్ భారాన్ని నిలపాలని చూసిన ప్రభుత్వ ప్రయత్నాన్ని నిలివేసిన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ ఈ సందర్భంగా నర్సింహనాయక్ మాట్లాడగా, కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్, బిల్లా సుధీర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, నాయకులు పూస మధు, నయీం, కాశీనాధం తదితరులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ సమ్మేళన కరపత్రాల ఆవిష్కరణ

నర్సంపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఆదిభట్లలో నవంబరు 1న నిర్వహించనున్న ధర్మ సమాజ్ పార్టీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆ పార్టీ నాయకులు బుధవారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు సంగాల శివకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ అణగారిన ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు అంశాలపైన ధర్మ సమాజ్ పార్టీ పోరాడుతుందన్నారు. నవంబరు 3న జరిగే సమ్మేళనానికి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందు, చరణ్, అనిల్, రాజేష్, బన్ని, విల్సన్, క్రాంతి, వేణు పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

దుగ్గొండి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో బుధవారం పంచాయతీ రాజ్ కార్యదర్శులు ఎంపీడీవో అరుంధతికి ఫిర్యాదు చేశారు. కార్యదర్శులలో ఔట్‌సోర్సు విధానాన్ని రద్దుచేయాలని, నాలుగేళ్ల కాలంలో చేసిన ప్రొఫెషనల్ పిరియడ్‌ను సర్వీసు కాలంగా పరిగణించాలనే డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యదర్శులు నరేశ్, దిలీప్‌కుమార్, స్రవంతి, కవిత, రజినీ, ఆనంద్, కావ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పర్వతగిరి, అక్టోంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ హన్మకొండ జేఎస్ఎస్‌లో జరిగిన అండర్-19 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 53 కేజీ విభాగంలో ఎం.అమూల్య, 60 కేజీల విభాగంలో జి.పూజ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్లు బొట్ల స్రవంతి, మమత అభినందించారు.

సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్‌లో...



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నారావుపేట, (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ క్రీడలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం సునీత తెలిపారు. ఇదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాదవత్ ప్రశాంత్ అనే విద్యార్థి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడన్నారు.నవంబరు 3, 4, 5 తేదీలల్లో మెదక్ జిల్లా తుప్రాన్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు వీరగోని స్వప్న, పిన్నింటి బాలాజీ రావు, రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ జావెద్, రామకృష్ణ, ఇందిర పాల్గొన్నారు.

● నల్లబెల్లి (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీ లకు మండలంలోని నందిగామ జెడ్పీఎస్‌హెచ్ విద్యార్థి గుండెబోయిన సన్నీ ఎంపికయ్యాడు. జిల్లాస్థాయిలో రెండు రోజు ల పాటు వరంగల్ ఓసిటీలో జరిగిన పాఠశాల స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ విభాగంలో సన్నీ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.



సన్నీ

నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు పూల కుండీని అందిస్తున్న నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

నర్సంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేట నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సువత్సల, వైస్ ప్రిన్సిపాల్‌గా చంద్రకళ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. వారిని నర్సం పేట నర్సింగ్‌కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం నియమించడంతో, నర్సింగ్ కళాశాలకు చెందిన ఉన్నతాధికారుల నియామకం జరుగకపోవడంతో, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ దాస్‌కు జైనింగ్ పత్రాన్ని అందజేసి విధుల్లో చేరారు. త్వరలో నర్సింగ్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు తెలిసింది.

భూగర్భ జల సంరక్షణ సామాజిక బాధ్యత

గీసుగొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని జిల్లా భూగర్భజల శాఖాధికారి అశోక్ అన్నారు. భూగర్భ జలరక్షణ-నీటివాడకంపై కొనాయిమాకుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవటం, బిందు సేద్యం, ఇంకుడు గుంతల ఉపయోగాల గురించి వివరించారు. ఎస్ఐ కుమార్ మాట్లాడుతూ తరగని ఆస్తులుగా భావితరాలకు భూగర్భ జలాలను అందించాలన్నారు.

మొక్కలకు, జీవజాతికి, నీటికి గల సంబం ధాన్ని ఉదహరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణాకర్, భూగర్భ జల శాస్త్రవేత్త రవి, అధ్యాపకులు మహేందర్, రమేష్, పీస్ ఫర్ ఆల్ నేషన్స్ డైరెక్టర్ సునిల్, సాల్మన్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోటే ఆర్థికాభివృద్ధి

నెక్కొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పౌరుడు ఉన్నత విద్యావంతులు అయినప్పుడే ఆ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని నెక్కొండ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హంస నరేందర్ అన్నారు. మండలంలోని అలంకానిపేటలో బుధవారం పౌరహక్కుల దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనాన్ని నిర్మూలించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మాంకాల యాదగిరి, కార్యదర్శి మధు, వీఆర్ఏ రాజేశ్, అంగన్‌వాడి టీచర్ పద్మ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారంలో అన్యాయం



అబేంద్కర్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

నెక్కొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సాగే ప్రధానంగా కుటుంబాలను పోషించుకుంటున్న రైతులకు చెందిన భూముల నుంచి ఎన్‌హెచ్-163-గ్రీన్‌ఫీల్డ్ హైవే పోతుండగా ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడంలో అన్యాయం చేస్తుందంటూ మండలంలోని తోపనపల్లి, వెంకటాపురం గ్రామాల రైతులు బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. హైవే నిర్మాణం కారణంగా ఏకరాల కొద్దీ భూములు పోతుండగా ఈ ప్రాంతంలో ఎకరా భూమికి రూ.60లక్షల నుంచి రూ.70 లక్షల వరకూ మార్కెట్‌లో ధర ఉందన్నారు. కానీ, ప్రభుత్వం కేవలం రూ.ఆరు లక్షల నుంచి ఏడు లక్షల మేర ఇస్తామనడం పట్ల విచారం వ్యక్తం చేశారు. నష్ట పరిహారం చెల్లింపులో రైతులకు అన్యాయం జరుగుతుందని, తమ ప్రాణాలు పోయినా ప్రభుత్వానికి తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. రైతులు కృష్ణారావు, వెంకటయ్య, వెంకటమ్మ, రాజు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

దడువాయిల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

● ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు రవి

నర్సంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న దడువాయిల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడానికి కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ పట్టణ అధ్యక్షుడు కంచు రవి అన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం దడువాయిల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దడువాయిలు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు వస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో దడువాయి సంఘం అధ్యక్షుడు గణిపాక సంజీవ, ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి మల్లయ్య, జిల్లా దాడ్వాయి సంఘం ప్రధాన కార్యదర్శి కీసరి రాంబాబు, కోశాధికారి కీసరి రాజీవ్, ఉపాధ్యక్షులు బోయిని లక్ష్మీ నారాయణ, గద్ద శ్రీనివాస్, ఎర్రబెల్లి కట్టయ్య పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డిని కలిసిన నాయకులు

రాయపర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం హైద్రాబాదులోని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డిని కలిసి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలు సుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలలో నాయకులు యాకూబ్‌రెడ్డి, రాజిరెడ్డి, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మారిన మినీ కమ్యూనిటీ హాల్



డీసీతండాలో కమ్యూనిటీ హాల్

వర్ధన్నపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట నూతన మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు డీసీతండాలో రూ.1.83 కోట్ల వ్యయంతో నిర్మించిన గిరిజన మినీకమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వ హయంలో మున్సిపాలిటీకి మంజూరు చేసిన ఈ కమ్యూనిటీ హాల్‌లో సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని స్థానిక గిరిజనులు విమర్శిస్తున్నారు. నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారులు చెబుతుండగా క్షేత్రస్థాయిలో మరుగుదొడ్లు, కిచెన్, డైనింగ్ హాల్ నిర్మించకపోవడంతో నిరుపయోగంగా మారింది. కనీసం పార్కింగ్ స్థలం సైతం లేదు. ప్రభుత్వం వచ్చే నిధులతో ఏదో పనులు చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించి దండుకోవడం కోసమే చేసిన పనులు అని గిరిజనతండావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యయంతో విశాలంగా ఉన్న స్థలంలో ఏర్పాటు చేసినట్లయితే రోజుకు వేలాది రూపాయలు వచ్చేవని అంటున్నారు. మున్సిపాలిటీ పాలకవర్గం, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యంగా పేరుకే కమ్యూనిటీ హాల్‌గా ఉందని సౌకర్యాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేయూ వైస్ చాన్స్‌లర్‌ను కలిసిన డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం



వైస్‌చాన్స్‌లర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నర్సంపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కేయూ నూతన వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రతాపరెడ్డిని నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపక బృందం బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం పరిశో ధన, అకాడమిక్ అంశాలపై చర్చించి, కళాశాలను సందర్శించాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో అధ్యాపకు లు బైరి సత్యనారాయణ, ఎం. సోమయ్య, ఎం. రాంబాబు, ఎస్. కమలాకర్, గణేష్, రుద్రాణి, సంధ్య పాల్గొన్నారు.

ప్రజాసేవే పరమావధి కావాలి..

వర్ధన్నపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసేవే పరమావధి కావాలని వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. పంచాయతీ కార్యదర్శులు సెంట్రల్ ఫోరం టీఎన్జీవో అనుబంధ సంఘానికి జిల్లా కోశాధికారిగా ఆకుల పృథ్వీరాజ్, జాయింట్ సెక్రటరిగా ఎస్‌కే హుస్సేన్ ఎన్నికైన సందర్భంగా బుధవారం వర్ధన్నపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వీరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎంపీవో ధనలక్ష్మి, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు , పంచాయతీ కార్యదర్శులు మురళి, సురేష్, అన్వేష్, రామారావు, బుస్స శ్రీనివాస్, జ్యోతి, లత, రాజు, దేవేందర్, ప్రణీత్, శ్రీకర్, నాగిరెడ్డి, సహజ, రత్నంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘం నర్సంపేట నియోజకవర్గ అధికార ప్రతినిధిగా అశోక్‌కుమార్‌యాదవ్



అశోక్‌కుమార్‌యాదవ్

ఖానాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం నర్సంపేట నియోజకవర్గ అధికార ప్రతినిధిగా బుధరావుపేట గ్రామానికి చెందిన కోడి అశోక్ కుమార్‌యాదవ్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగల శ్రీనివాస్ బుధవారం అశోక్‌కుమార్ యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కుల వృత్తులుగా వేరైనా బీసీలుగా అందరం ఒకటేననే నినాదంతో ఐక్యంగా ఒకటి కావడం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా తన నియామకానికి సహకరించిన జిల్లా ప్రధానకార్యదర్శి నందగిరి రజినీకాంత్, మండల అధ్యక్షుడు గంధ్రాతి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



క్షేత్రస్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఏర్పాటుచేసిన అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి ఆ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం వరంగల్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ పురోగతిపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో 31 వేల 800ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు రాగా, అందులో 1,957 మాత్రమే పరిశీలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అలసత్వాన్ని వీడి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి రత్నకుమారి, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ సిటీప్లానర్ రవీంద్ర రడెకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి

ప్రభుత్వం నిర్దేశించిన నియమాలపై రైతులకు అవగాహన కల్పించి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరుపాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 203 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చేయగా, ఇప్పటివరకు 14 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. డిఫాల్టర్ రైస్ మిల్లర్లకు ఈ సీజన్‌లో ధాన్యం ఇవ్వడం లేదని, మిగతా మిల్లర్లకు బ్యాంక్ గ్యారంటీతో ధాన్యం కేటాయిస్తామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీసీవో నీరజ, వ్యవసాయశాఖ అధికారి అనురాధ, పౌరసరఫరాల శాఖ డీఎం బి.సంధ్యారాణి, డీసీఎస్‌వో కిష్టయ్య, డీఎంవో సురేఖ, రైస్ మిల్లర్స్ పాల్గొన్నారు.

2న బీసీ కమిషన్ సభ్యుల రాక

స్థానిక సంస్థల రిజర్వేషన్ల కల్పనపై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా బీసీ కమిషన్ సభ్యులు నవంబరు 2వ తేదీన హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశానికి హాజరవుతున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, భాగ్యలక్ష్మీ వస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ప్రజలు తమ అభిప్రాయాలను, విజ్ఞప్తులను కమిషన్ బృందానికి సమర్పించాలని కలెక్టర్ కోరారు.

వరంగల్ డీఎంహెచ్‌వోగా సాంబశివరావు

హనుమకొండ డీఎంహెచ్‌వోగా అప్పయ్య


సాంబశివరావు


డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల అయోమయానికి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఎట్టకేలకు తెరదించింది. వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ సాంబశివరావును, హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ అప్పయ్యను నియమిస్తూ ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు నెలల కాలం నుంచి వరంగల్, హనుమకొండ జిల్లాల ఆరోగ్యశాఖలో అయోమయం నెలకొంది. తాజా ఉత్తర్వులతో స్పష్టత వచ్చింది. ఇంతకాలం వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేసిన డాక్టర్ వెంకటరమణ కరీంనగర్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా కొనసాగనున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

మట్టెవాడ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 23 మందికి బుధవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. 23 మందికి రూ.237000, అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురికి రూ. 4500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ తెలిపారు.

ఉద్యోగులకు విరమణ సహజం

● గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి



విరమణ పొందుతున్న సిబ్బందిని అభినందిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 30: ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని మేయర్ గుండు సుధారాణి అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు విభాగాల్లో సుదీర్ఘకాలం పాటు పని చేసి ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారులు, సిబ్బందిని బుధవారం బల్దియా కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రాజయ్య, వార్డు ఆఫీసర్ నర్సింహ, హెల్పర్ మీర్జా గౌస్‌లను జ్ఞాపిక, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, స్మార్ట్‌సిటీ ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, టౌన్‌ప్లానింగ్ ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్‌తో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీలో పలువురు ఉద్యోగులకు సన్మానం

కేయూ క్యాంపస్: కేయూలో మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన బాటనీ విభాగం ప్రొఫెసర్ మహ్మద్ ముస్తాఫా, సూపరింటెండెంట్ పురం రమేశ్‌లను కేయూ సెనెట్ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు శాలువా, మెమెంటో అందచేసి ఘనంగా సన్మానించారు.

ఉద్యోగులకు విరమణ తప్పదు

వరంగల్ కలెక్టరేట్: ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్ అన్నారు. బుధవారం హనుమకొండలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగి శంకర్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ సురేశ్ మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లుగా సేవలందించిన శంకర్ అధికారుల మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం శంకర్-విజయ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, జనగామ జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు బాలరాజు, మాధవీలత, ఉద్యోగులు పాల్గొన్నారు.

బోధన, పరిశోధనతోనే అధ్యాపకులకు గుర్తింపు

కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి



ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డిని సన్మానిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 30: (ఆంధ్రజ్యోతి): మంచి బోధన, అత్యున్నత పరిశోధన ప్రమాణాలతో అధ్యాపకులకు గుర్తింపు లభిస్తుందని కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూ కమిటీ హాల్‌లో వర్సిటీ విభాగాధిపతులు, ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులతో వీసీ ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డిని శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ బొద్దిరెడ్డి రమరెడ్డి, డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు, కేయూ ఫిజిక్స్ విభాగాధిపతి జి.మంజుల, కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అకుట్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీ సంఘం నాయకుల వినతి

కేయూ ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారిపై అవినీతి ఆరోపణలు సరికావని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరెగంటి నాగరాజుగౌడ్ అన్నారు. బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి బీసీ విద్యార్థి సంఘం నేతృత్వంలో వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ఐసెట్ కన్వీనర్, కంట్రోలర్ నరసింహచారిపై కొంతమంది అనవసరమైన ఆరోపణలు చేస్తూ బురద చల్లుతున్నారని చెప్పారు. ఐసెట్‌లో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరుగలేదని స్పష్టం చేశారు. బీసీ కేటగిరికి చెందిన నరసింహచారిపై విషప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేయూ రిసెర్చ్ స్కాలర్స్ అసోషియేషన్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళపల్లి నరేశ్‌గౌడ్, విష్ణు, సోమరాజు, కేయూబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు సుధగాని మధుగౌడ్, రాజ్‌కువర్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేసేదాకా పోరాడుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు లక్ష్మణ్

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేసేదాకా ఏఐఎస్ఎఫ్ పోరాటాలు చేస్తూనే ఉంటుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీత్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, చరణ్, కుమార్, భానుప్రసాద్, రవితేజ, పవన్, వినయ్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, లవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నియంత్రణాధికారికి అదనపు బాధ్యతలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా విధుల్లో ఉన్న డాక్టర్ బి.నాగరాజుకు కాన్ఫిడెన్షియల్ విభాగం అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలను అప్పగిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం అప్పటి వరకు కాన్ఫిడెన్షియల్ విభాగం అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా పనిచేసిన ప్రొఫెసర్ ఎమ్డీ ముస్తాపా ఉద్యోగ విరమణ చేయడంతో నాగరాజుకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. కేయూ పరిపాలన భవనంలో నాగరాజుకు వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి సమక్షంలో ఉత్తర్వుల కాపీని అందచేసి అభినందనలు తెలిపారు.

హోంగార్డులకు యూనిఫామ్



హోంగార్డులకు ట్రాఫిక్ యూనిఫారం అందచేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ట్రాఫిక్ హోంగార్డు సిబ్బందికి సీపీ అంబర్ కిశోర్ ఝా ట్రాఫిక్ యూనిఫారాన్ని అందచేశారు. బుధవారం వరంగల్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రామక్రిష్ణ ఆధ్వర్యంలో సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ విభాగంలో నిరంతరం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సిబ్బందికి సీపీ నూతన ట్రాఫిక్ యూనిఫారాన్ని అందచేశారు. ఈ సందర్భంగా సీపీ సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతోపాటు హోంగార్డ్స్ పనితీరు అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ

వరంగల్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ భద్రకాళి ఆలయాన్ని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ తన కుటుంబసభ్యులతో బుధవారం సందర్శించారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించి అమ్మవారి సన్నిధిలో ఆయనచే ప్రత్యేక పూజలు నిర్వహింప చేశారు. అనంతరం ఈవో శేష భారతి అమ్మవారి శేష వస్త్రాలను బహూకరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బల్దియా సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బల్దియా పరిధిలో పని చేస్తున్న శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో శానిటేషన్, ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేసి మేయర్ మాట్లాడారు. చెత్త సేకరణ వాహనాలు మరమ్మతు వెంటనే పూర్తి చేయాలన్నారు. నగరంలో ప్రతీ ఇంటి నుంచి వంద శాతం తడి, పొడి చెత్త సేకరణ జరగాలన్నారు. ప్లాస్టిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు క్రియాశీలకంగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ మహేందర్, డీఈ శివానంద్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్ వర్మతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై సర్వే నిర్వహించాలి

జనగామ జిల్లా పంచాయతీ అధికారి స్వరూప



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీపీవో

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి, కుటుంబ, సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ను సంబంధిత సిబ్బంది ప్రజలతో మమేకమై నిర్వహించా లని డీపీవో నాగపూరి స్వరూప తెలిపారు. బుధవారం ఘన్‌పూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఒక్కో ఎన్యుమరేటర్ 150 గృహాలను ఎంపిక చేసుకొని కుటుంబ సర్వే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సర్వే నవంబరు 1నుంచి 5వ తేదీ వరకు ఇంటింటి సర్వే, 6నుంచి 18వ తేదీ వరకు సమగ్ర కుటుంబ సర్వే ఉంటుందన్నారు. సర్వే నిర్వహించే ఎన్యుమరేటర్లు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించే క్రమంలో ప్రజలతో సామరస్యంగా ఉండి వివరాలను నమోదు చేయాలని సూచించారు. సర్వేలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్ద న్నారు. శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన సిబ్బంది వివరాల ను నమోదు చేసుకొని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు డీపీవో తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో ధరంసోత్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, ఎంపీవో నర్సింగరావు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

బల్దియా కాంట్రాక్టర్ అసోసియేషన్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సివిల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం బల్దియా కార్యాలయం ఆవరణలో ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా పూజారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మిట్టపెల్లి సురేందర్, జాయింట్ సెక్రెటరీగా ఎ.వెంకటస్వామి, గౌరవ అధ్యక్షుడిగా కె.సుధాకర్, ముఖ్య సలహాదారుడిగా సాంబయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులే కీలకం

కేయూ క్యాంపస్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య అన్నారు. బుధవారం కేయూ పూర్వ విద్యార్థి డాక్టర్ సుధీర్‌కుమార్ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కేయూ ఫార్మసీ విభాగంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ గాదె సమ్మయ్య మాట్లాడుతూ.. సుధీర్‌కుమార్ తన సేవలను గల్ఫ్ దేశాలతో పాటు ట్రినిటీలో అందించారని చెప్పారు. ఫార్మసీ రంగానికి సుధీర్‌కుమార్ అందించిన సేవలకు గుర్తింపుగానే అత్యంత ప్రతిష్టాత్మకమైన పీసీఐ సభ్యులుగా ఎంపికయ్యారని కొనియాడారు. సీపీఐ సభ్యుడు సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని చెప్పారు. ప్రజల ఆరోగ్య రక్షణలో ఫార్మసిస్టులది కీలకపాత్ర అని చెప్పారు. ఈ సందర్భంగా కేయూ ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సుధీర్‌కుమార్‌ను సన్మానించారు.

పదవీకాలం పొడిగింపు

కేయూ యూజీ విభాగం అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా విధుల్లో ఉన్న డాక్టర్ ఎం.తిరుమలదేవి పదవీ కాలం బుధవారంతో ముగియగా మరో ఏడాది కాలం పాటు పొడిగిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను బుధవారం వీసీ ప్రతాప్‌రెడ్డి పరీక్షల నియంత్రణాధికారి నరసింహచారి సమక్షంలో తిరుమల దేవికి అందచేసి అభినందనలు తెలిపారు.

పీజీ పరీక్షల నియంత్రణాధికారిగా అసీం ఇక్బాల్

కాకతీయ యూనివర్సిటీ పీజీ విభాగం అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా కేయూ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అసీం ఇక్బాల్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అందచేసి అభినందనలు తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర విద్య కమిషన్ చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, విద్య కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావులకు బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కలిసి కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతలు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎం.రామేశ్వర్‌రావు, డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏవో సేవలు అభినందనీయం

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



ఏవో సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో కీలకమైన అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కుసుమ సత్యనారాయణ అందించిన సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం రాత్రి కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ గార్లపాటి రుక్మిణిల ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ సరస్వతి, రుక్మిణి వెంకటేశ్వర్‌రావు దంపతులను కలెక్టర్ ప్రావీణ్య ఇతర అధికారులతో కలిసి గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ట్రెస్సా రాష్ట్ర నాయకుడు గనిపాక రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్, జిల్లా అధికారులు, తహసీల్దార్‌లు, అధికారులు, రెవెన్యూ ఉద్యోగులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీవోస్ నాయకులు

హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్యను టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఉద్యోగ సంఘాల నాయకులు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నేతలు రామునాయక్, మోయిజ్, లక్ష్మీప్రసాద్, జిల్లా నేతలు రాజీవ్, ప్రణయ్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన హనుమకొండ ఆర్డీవో

హనుమకొండ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రాథోడ్ రమేష్ బుధవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఆర్డీవో కలెక్టర్‌కు పూలమొక్క అందజేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర వెంకట్‌రెడ్డిని కలిశారు.

'15 రోజుల్లో సర్వే పూర్తి చేయాలి'

హసన్‌పర్తి, అక్టోబర్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పదిహేను రోజుల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ టీటీడీసీ శిక్షణా కేంద్రం సమావేశ మందిరంలో బుధవారం సమగ్ర కుటుంబ సర్వేపై ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. శిక్షణ పొందిన ప్రతీ ఒక్కరు ప్రతీ రోజు 10 నుంచి 12 కుటుంబాలు లక్ష్యంగా తీసుకొని 150 నుంచి 170 ఇండ్లు సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఆకుతోట ప్రభాకర్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలు, ఆశా వర్కర్లు 70 మంది పాల్గొన్నారు.

'సైన్స్ సంబరాలలో భాగస్వాములు కావాలి'

మడికొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక కాజీపేట మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముఖి సైన్స్ సంబరాలలో విద్యార్థులు భాగస్వాములు కావాలని మండల విద్యాశాఖాధికారి బండారు మనోజ్‌కుమార్ సూచించారు. కడిపికొండలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జన విజ్ఞాన వేదిక మండల శాఖ అధ్యక్షుడు పాల కుమారస్వామితో కలిసి సైన్స్ సంబరాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ పాఠశాల స్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్ నవంబరు 7న, మండల స్థాయి 21న, జిల్లాస్థాయి 28న, అలాగే రాష్ట్రస్థాయి టెస్ట్ డిసెంబరు 14, 15, 16 తేదీలలో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజగోపాల్, మాధవీలత, నవీన్‌కుమార్, విజయ, సునీత, రాజశ్రీ, వాణిశ్రీ, రేణుకాదేవి, రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లో బాణసంచా దుకాణాలు

వరంగల్ పాతబీటు బజార్‌లో విచ్చలవిడిగా అమ్మకాలు

భారీఎత్తున టపాసుల నిల్వలు.. పట్టించుకోని పోలీసులు



వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలో టపాసుల లోడు దింపుతున్న దృశ్యం

హనుమకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో బాణాసంచా విక్రయాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. జనసమ్మర్థం అధికంగా ఉండే ప్రదేశాల్లో, ఇరుకు సందుల్లో, దుకాణాల సముదాయాల మధ్యలో నిత్యావసర సరుకుల్లా దీపావళి బాణసంచా దుకాణాలు వెలిశాయి. దీపావళి పండుగ వచ్చిందంటే బాణసంచాకు ఎక్కడిలేని డిమాండ్ ఏర్పడుతుంది. దీపావళి రోజు ప్రతీ ఒక్కరు తమ ఇళ్ల ముందు బాణా సంచాను కాల్చుతుంటారు. ఇదే అవకాశంగా తీసుకొని వ్యాపారులు కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసి హోల్‌సేల్‌గా, రిటేల్‌గా అమ్మకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం వరంగల్ నగరంలో ఎక్కడచూసినా చిన్నచితకా బాణసంచా దుకాణాలే కనిపిస్తున్నాయి. కొందరు బడా వ్యాపారులైతే కాలనీల మధ్యలోనే బాణసంచా హోల్‌సేల్ దుకాణాలను తెరిచారు. వివిధరకాల టపాసులను ప్యాకెట్ల వారీగా కాక ఏకంగా కిలోల చొప్పున విక్రయిస్తున్నారు.

వరంగల్‌లోని పాతపాటు బజార్ ప్రాంతంలో సాధారణ దుకాణాల మధ్యనే బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. కొనుగోలుదారులకు తెలిసే పెద్ద పెద్ద బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. వరంగల్ జేపీఎన్ రోడ్డులో అయితే ఏకంగా ఒక ప్రైవేటు హోటల్ గల్లీలోనే బాణసంచాను స్వేచ్ఛగా విక్రయిస్తున్నారు. చిన్నమొతాదులో టపాసులను విక్రయిస్తే పరవాలేదు. కొందరు వ్యాపారులైతే కొద్దిరోజుల ముందే భారీ మొత్తంలో బాణసంచాను దొంగచాటుగా తీసుకువచ్చి అక్రమంగా నిల్వచేసి రెండు, మూడు రోజులుగా జానావాసాల మధ్యనే జోరుగా విక్రయిస్తున్నారు. ఈ దుకాణాలకు అనుమతి ఉందా లేదా తెలియదు. ఒక వేళ ఉంటే పోలీసులు ఎలా అనుమతి ఇచ్చారనేది ప్రశ్నార్థకం. బాణసంచా విక్రయించాలంటే ముందుగా పోలీసు, అగ్నిమాపక శాఖల నుంచి అన్ని అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. తగిన భద్రతా ప్రమాణాలను పాటించాలి. కానీ నగరంలో ప్రస్తుతం బాణా సంచా అమ్మకాలు జరుపుతున్న దుకాణాల్లో చాలా వాటికి అనుమతులు లేవని తెలుస్తోంది. జనావాసాల మధ్య వెలిసిన బాణాసంచా దుకాణాల్లో ఏ చిన్న అగ్నిప్రమాదం జరిగిన పెద్దఎత్తున ఆస్తినష్టం, ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉంది.

బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 30: (ఆంధ్రజ్యోతి) : నవంబర్ 1వ తేదీ నుంచి 5 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు హనుమకొండ జిల్లాకు చెందిన ఎం.ప్రవీణ్, సురాని సాయివర్ధన్‌లో ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లోని బాస్కెట్‌బాల్ కోర్టులో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ప్రవీణ్, సాయివర్ధన్‌లను హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో అశోక్‌కుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సాధికారతే లక్ష్యం



జాతీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళిగౌడ్, అధ్యాపకులు

వడ్డెపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో చైతన్యవంతంగా తమ పాత్ర పోషించేందుకు వీలుగా మహిళా సాధికారతే లక్ష్యంగా కృషి చేయాలని పింగిళి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాలలోని వాణిజ్య శాస్త్రం, మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో భారత దేశంలో ఆర్థిక అక్షరాస్యత - మహిళా సాధికారిక సమస్యలు అనే అంశంపై నిర్వహించే జాతీయ సదస్సు కరపత్రాన్ని అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రమౌళిగౌడ్ మాట్లాడుతూ మహిళలు స్వయం కృషితో అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గుగులోత్ రాజు నాయక్, కన్వీనర్ డాక్టర్ ఎ.సారంగపాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుహాసిని, వివిధ శాఖల అధిపతులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

టపాసులు కాల్చే వేళ.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వరంగల్ మెడికల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను దేశం మొత్తం కుటుంబసభ్యులతో చాలా సంతోషంగా, ఆనందంగా జరుపుకునే పండగ. దీపావళి పండను జాగ్రత్తగా జరుపుకోవాలని, అజాగ్రత వహిస్తే చీకటిగా మారే ప్రమాదం ఉందని అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జీవీకే ఈఎంఆర్ఐ అత్యవసర సేవల కార్యనిర్వహణాధికారి ఎండి.ఖలీద్ వివరించారు.

- దీపావళి టపాసులు కాలుస్తున్నప్పుడు ఇంటి బయట దూరంగా పేల్చాలి.
- ధ్వని ఎక్కువగా వచ్చే టపాసులు కాల్చకపోవడం ఎంతో మేలు
- టపాసులు కాలుస్తున్నప్పుడు శరీరానికి వదులుగా ఉండే నూలు దుస్తులు ధరించాలి.
- చిన్న పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దవారు పక్కనే ఉండాలి
- కాళ్లకు కచ్చితంగా చెప్పులు ధరించాలి
- కంటి అద్దాలు, మాస్క్ ధరించడం మర్చిపోవద్దు
- చేతులతో టపాసులు పేల్చకూడదు
- ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించాలి

శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్లు

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, సత్యశారద బుధవారం ప్రకటన విడుదల చేశారు. దీపావళి పర్వదినాన్ని కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహలతో ప్రజలు నిర్వహించుకోవాలని, ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగిపోయి వెలుగులు నిండాలని, అందరు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అన్నారు. ఈ దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.